
తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
శనివారం
23, మే, 2026



# జిల్లా ఒకటి.. అసెంబ్లీ మరోటి.. పార్లమెంట్ ఇంకోటి..!

- పరిపాలనా గందరగోళంలో చిక్కుకున్న చేర్యాల అభివృద్ధి
- 10 ఏళ్లుగా జేఏసీ పోరాటాలు వృథా..
- గత పాలకులు-ప్రస్తుత పాలకులు ఇద్దరూ పట్టించుకోవడం లేదని ప్రజల ఆవేదన
- సమస్యల వలయంలో చిక్కుకున్న చేర్యాల ప్రజలు
- నిధుల కేటాయింపులో అయోమయం.. అభివృద్ధి పనుల్లో జాప్యం
- యువత ఉపాధి కోసం పట్టణాలకు వలస బాట
- చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కళ నెరవేరేనా..?

**చేర్యాల, మే 22 (జనంసాక్షి) :** ఉమ్మడి నల్లగొండ, వరంగల్ జిల్లాలో తాలూకగా, నియోజకవర్గ కేంద్రంగా ఉండి ఎంతో చరిత్ర కలిగిన చేర్యాల ప్రాంత ప్రజల చిరకాల కోరికైన చేర్యాల రెవెన్యూ డివిజన్, పాత నియోజకవర్గ పునరుద్ధరణ ఏర్పాటు కోసం గత పదేళ్లుగా జేఏసీ ఆధ్వర్యంలో ప్రజలు చేస్తున్న అలుపెరుగని పోరాటానికి న్యాయం జరిగేనా..? అస్తిత్వాన్ని కోల్పోయిన చేర్యాల ప్రాంతానికి

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత గ్రామీణ ప్రాంతాలకు పరిపాలనను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో కొత్త జిల్లాల ఏర్పాటు చేపట్టిన ప్రభుత్వం, పరిపాలనలో పారదర్శకత, వేగవంతమైన సేవలు, ప్రాంతీయ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగింది. అయితే కొన్ని ప్రాంతాల్లో మాత్రం ఈ పరిపాలనా విభజనలు ఆశించిన ఫలితాలను ఇవ్వకపోగా ప్రజలకు కొత్త సమస్యలను సృష్టించాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అలాంటి ప్రాంతాల్లో చేర్యాల ప్రధానంగా నిలుస్తోంది.

చారిత్రక ప్రాధాన్యం, సాంస్కృతిక వారసత్వం, వాణిజ్య కేంద్రంగా గుర్తింపు, భౌగోళికంగా కీలక స్థానం ఉన్నప్పటికీ చేర్యాల ప్రాంతం అభివృద్ధి విషయంలో ఇంకా వెనుకబడిపోయిందనే భావన స్థానికుల్లో రోజురోజుకూ పెరుగుతోంది. ప్రభుత్వ పరిపాలనా విభజనల్లో చేర్యాల ప్రాంతం వేర్వేరు వ్యవస్థల మధ్య చిక్కుకుపోవడం వల్ల అభివృద్ధి పనులు సరిగా జరగడం లేదని ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం చేర్యాల, మద్దూరు, కొమురవేల్లి, ధూళ్మిట్ట మండలాలు నియోజకవర్గ పరంగా జనగామ పరిధిలో ఉండగా, పార్లమెంట్ భూవనగిరి, జిల్లాల పునర్విభజనలో భాగంగా సిద్ధిపేట పరిధిలో చేర్చారు. చేర్యాల, కొమురవెల్లి మండలాలు రెవెన్యూ డివిజన్ పరంగా సిద్దిపేటలో ఉండగా, మద్దూరు ధూళ్మిట్ట మండలాలు హుస్నాబాద్ పరిధిలో చేర్చారు. ఇలా ఆశాస్త్రీయంగా మూడుముక్కలు చేయడం వల్ల ప్రజలకు స్పష్టమైన పరిపాలనా దిశ కనిపించడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ పరిపాలనా విభజనల గందరగోళం వల్ల ప్రజా సమస్యలు పరిష్కారం కాకుండానే సంవత్సరాలుగా పనులు పెండింగ్‌లో పడిపోతున్నాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### జేఏసీ పోరాటాలు.. పదేళ్లుగా వృథా అవుతున్నాయా..?

చేర్యాల ప్రాంత అభివృద్ధి, పరిపాలనా స్పష్టత, మౌలిక వసతులు, ప్రభుత్వ కార్యాలయాల సమన్వయం, ప్రత్యేక నిధుల కేటాయింపు వంటి డిమాండ్లతో గత పదేళ్లుగా చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని, నియోజకవర్గ కేంద్రాన్ని పునరుద్ధరించాలని జేఏసీ ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు, ధర్నాలు, రాస్తారోకోలు, దీక్షలు నిరసన కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ ఇప్పటికీ సరైన పరిష్కారం కనిపించడం లేదని ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రజల మాటల్లో చెప్పాలంటే "చేర్యాల కోసం పోరాటాలు చేస్తున్న వాళ్లు అలసిపోయారు కానీ ప్రభుత్వాలు మాత్రం మారడం లేదు" అనే పరిస్థితి నెలకొంది. ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రాలు సమర్పించినా, అధికారులు సమావేశాలు నిర్వహించినా, సమస్యలు మాత్రం అలాగే కొనసాగుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. జేఏసీ ఆధ్వర్యంలో గత పదేళ్లుగా జరిగిన ఉద్యమాల్లో పలువురు యువకులు, కార్యకర్తలు కేసులు కూడా ఎదుర్కొన్నారని స్థానికులు గుర్తుచేస్తున్నారు. "చేర్యాల అభివృద్ధి కోసం పోరాడితే కేసులు వచ్చాయి కానీ అభివృద్ధి మాత్రం రాలేదు" అని పలువురు రెవెన్యూ డివిజన్ జేఏసీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాంత అభివృద్ధి కోసం రాత్రింబవళ్లు శ్రమించిన నాయకులు, ప్రజా సంఘాలు, వ్యాపార వర్గాలు, యువత- అందరూ ఎన్నో ఆశలు పెట్టుకున్నప్పటికీ పాలకుల నిర్లక్ష్య ధోరణి కారణంగా చేర్యాల సమస్యలు రోజురోజుకూ మరింత తీవ్రమవుతున్నాయని ప్రజలు అంటున్నారు.

### గత పాలకులు - ప్రస్తుత పాలకులు ఎవరికీ చేర్యాలపై చిత్తశుద్ధి లేదా..?







చేర్యాల ప్రాంత ప్రజల ప్రధాన ఆరోపణ ఇదే.. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం చేర్యాల అభివృద్ధిపై ఎన్నో హామీలు ఇచ్చినా వాటిలో చాలా వరకు అమలు కాలేదని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేర్యాల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. "పాలకులు మారుతున్నారు కానీ చేర్యాల పరిస్థితి మాత్రం మారడం లేదు" అని స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో మాత్రం చేర్యాల అభివృద్ధి, రోడ్లు, మున్సిపల్ సదుపాయాలు, డ్రైనేజీ వ్యవస్థ, ప్రభుత్వ ఆసుపత్రులు, మార్కెట్ యార్డులు, ఉపాధి అవకాశాలపై పెద్ద ఎత్తున హామీలు ఇస్తున్నారని, కానీ ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రజల సమస్యలు మళ్లీ పక్కన పడిపోతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. "గత పాలకులు పట్టించుకోలేదు.. ప్రస్తుతం ఉన్న పాలకులు కూడా అదే నిర్లక్ష్య ధోరణిని కొనసాగిస్తున్నారు. పదేళ్లుగా జేఏసీ పోరాటాలు జరుగుతున్నా పాలకుల్లో చలనం కనిపించడం లేదు" అని పలువురు ప్రజా సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు.

### ఎవరి పరిధిలో చేర్యాల..? ప్రజల్లో అయోమయం...

స్థానిక ప్రజల మాటల్లో చెప్పాలంటే "చేర్యాల ఏ శాఖ పరిధిలో ఉందో అధికారులకు కూడా పూర్తిగా స్పష్టత లేదనే పరిస్థితి" నెలకొంది. జిల్లా పరంగా ఒకచోట, అసెంబ్లీ పరంగా మరోచోట, రెవెన్యూ పరంగా ఇంకోచోట, పార్లమెంట్ పరంగా వేరే ప్రాంతంలో ఉండటం వల్ల ప్రజల సమస్యలు మధ్యలోనే నిలిచిపోతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. చిన్న చిన్న సమస్యల పరిష్కారానికి కూడా ప్రజలు అనేక కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని చెబుతున్నారు. తాగునీటి సమస్యల కోసం ఒక అధికారిని సంప్రదిస్తే అది మున్సిపల్ పరిధి అంటున్నారని, రోడ్ల సమస్యలపై మాట్లాడితే అది జిల్లా లేదా అసెంబ్లీ పరిధి అంటూ ఒకరిపై ఒకరు బాధ్యతలు నెట్టేస్తున్నారని ప్రజలు అంటున్నారు. భూసంబంధిత సమస్యలు, పట్టాదారు పాసుబుక్ లు, రైతు బంధు, సాగునీటి సమస్యలు, కాలువల నిర్మాణం, మురుగు నీటి పారుదల వంటి అంశాల్లో కూడా స్పష్టమైన సమన్వయం లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటున్నారు.

### అభివృద్ధి పనుల్లో తీవ్ర జాప్యం...

చేర్యాల ప్రాంతంలో అభివృద్ధి పనులు చాలా వరకు నత్తనడకన సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, ట్రాఫిక్ నియంత్రణ, బస్టాండ్ అభివృద్ధి, మార్కెట్ యార్డ్ సదుపాయాలు, పార్కుల నిర్మాణం, ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి వంటి అంశాల్లో సరైన ప్రణాళిక కనిపించడం లేదని అంటున్నారు. కొన్ని రహదారులు సంవత్సరాలుగా మరమ్మతులకు నోచుకోక దెబ్బతిన్నాయని, వర్షాకాలంలో రోడ్లపై నీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. కొన్ని కాలనీల్లో డ్రైనేజీ సమస్యలు తీవ్రమై దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొంటున్నారు. ముఖ్యంగా వర్షాకాలం సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు పూర్తిగా దెబ్బతిని రాకపోకలకు అంతరాయం కలుగుతోందని రైతులు చెబుతున్నారు. అత్యవసర సమయంలో అంబులెన్స్‌లు, ఫైర్ ఇంజన్ లు కూడా సకాలంలో చేరలేని పరిస్థితులు ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### నిధుల కేటాయింపులో అయోమయం...

ప్రాంతీయ అభివృద్ధి కోసం ప్రభుత్వం విడుదల చేసే నిధుల విషయంలో కూడా చేర్యాల ప్రాంతం నష్టపోతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జిల్లా, అసెంబ్లీ, పార్లమెంట్ పరంగా వేర్వేరు పరిపాలనా వ్యవస్థల్లో ఉండటం వల్ల ఏ అభివృద్ధి పనికి ఎవరు నిధులు కేటాయించాలి అనే అంశంలో స్పష్టత లేకుండా పోతోందని స్థానిక నాయకులు చెబుతున్నారు. కొన్ని అభివృద్ధి ప్రతిపాదనలు ఒక కార్యాలయం నుంచి మరో కార్యాలయానికి తిరుగుతూనే నెలలు, సంవత్సరాలు గడుస్తున్నాయని, ఫలితంగా పనులు ప్రారంభం కాకుండానే నిలిచిపోతున్నాయని అంటున్నారు. కొన్నిసార్లు టెండర్లు పూర్తయినా నిధుల విడుదల ఆలస్యమవడంతో పనులు మధ్యలోనే ఆగిపోతున్నాయని ఆరోపిస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం తగ్గుతోందని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

### యువత ఉపాధి కోసం వలస...

చేర్యాల ప్రాంతానికి విద్యా పరంగా, వ్యాపార పరంగా మంచి అవకాశాలు ఉన్నప్పటికీ పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు మాత్రం చాలా తక్కువగా ఉన్నాయని యువత చెబుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో యువత పెద్ద ఎత్తున హైదరాబాద్, వరంగల్ వంటి నగరాలకు వలస వెళ్తున్నారని అంటున్నారు. స్థానికంగా పరిశ్రమలు లేకపోవడం వల్ల చదువుకున్న యువత కూడా చిన్న చిన్న ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు, చిన్న పరిశ్రమలు, ఐటీ సంబంధిత అవకాశాలు, ప్రభుత్వ ఉద్యోగ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తే చేర్యాల ప్రాంత యువతకు ఎంతో మేలు జరుగుతుందని అభిప్రాయపడుతున్నారు.

### ప్రభుత్వ కార్యాలయాల సమన్వయం లోపం...

ప్రభుత్వ కార్యాలయాల మధ్య సమన్వయం లేకపోవడం కూడా ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేస్తోందని స్థానికులు చెబుతున్నారు. రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, సాగునీటి, పంచాయతీ రాజ్ శాఖల మధ్య సరైన సమన్వయం లేకపోవడం వల్ల ప్రజా సేవలు ఆలస్యమవుతున్నాయని ఆరోపిస్తున్నారు. కొన్ని సమస్యలు ఒక శాఖ నుంచి మరో శాఖకు మారుతూనే ఉండి నెలల తరబడి పరిష్కారం కాకుండా పోతున్నాయని ప్రజలు అంటున్నారు. ముఖ్యంగా పట్టణ విస్తరణ, మౌలిక వసతుల కల్పన, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాల్లో సమగ్ర ప్రణాళిక అవసరమని చెబుతున్నారు.

### ప్రజల ఆవేదన ఇదే..

"చేర్యాల ప్రాంతం రాజకీయంగా, పరిపాలనా పరంగా ఎక్కడికి చెందుతుందో ప్రజలకు కూడా అర్థం కాకుండా పోయింది. జిల్లా ఒకటి, అసెంబ్లీ మరోటి, పార్లమెంట్ ఇంకోటి కావడంతో మా సమస్యలకు పూర్తి బాధ్యత తీసుకునే నాయకత్వం కనిపించడం లేదు" అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "ప్రతి శాఖకు తిరిగినా ఫలితం కనిపించడం లేదు. చిన్న పనికీ నెలలు పడుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల ప్రజలే ఇబ్బందులు పడుతున్నారు" అని పలువురు వ్యాపారులు పేర్కొన్నారు.

### ప్రత్యేక అభివృద్ధి ప్రణాళిక అవసరం...

చేర్యాల ప్రాంత అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా, అసెంబ్లీ, పార్లమెంట్, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయం కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అలాగే చేర్యాల పట్టణ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించి రోడ్లు, డ్రైనేజీలు, మార్కెట్ యార్డులు, ప్రభుత్వ ఆసుపత్రులు, విద్యా సంస్థలు, పారిశ్రామిక వాడలు, యువత ఉపాధి అవకాశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### పోరాటాల చరిత్ర కలిగిన చేర్యాలకు న్యాయం ఎప్పుడు..?

నిజాం రజాకార్ల దేశముఖ్ దొరలకు వ్యతిరేకంగా పోరాడిన త్యాగాల చరిత్ర కలిగిన చేర్యాలకు న్యాయం ఎప్పుడు జరుగుతుంది. అనే ప్రశ్న ఇప్పుడు స్థానిక ప్రజల్లో బలంగా వినిపిస్తోంది. ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక ఆకాంక్షను పాలకవర్గ ప్రభుత్వాలు ఎప్పుడు నెరవేరుస్తాయో వేచి చూడాల్సి ఉంది.

# కనీవినీ ఎరుగని రీతిలో మక్తల్ పట్టణంలో టౌన్ హాల్ ఏర్పాటుకు చర్యలు

**- హైదరాబాదులో పలు టౌన్ హాల్ లను పరిశీలించిన మంత్రి వాకిటి శ్రీహరి**



**మక్తల్, మే 22 (జనంసాక్షి) :** మక్తల్ పట్టణంలోని సంత బజారులో ఏర్పాటు చేయనున్న టౌన్ హాల్ ను పూర్తిస్థాయి హంగులతో కనివిని ఎరుగని రీతిలో ఏర్పాటు చేసేందుకు మంత్రి వాకిటి శ్రీహరి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా హైదరాబాదులోని రవీంద్ర భారతి, సంత్ సేవాలాల్ భవన్, ఇతర భవన్లను మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి పరిశీలించారు. మంత్రి వెంబడి పంచాయతీరాజ్ డిఇ ఉపేందర్, ఏఈ అరుణ్ సైతం వెళ్ళగా ఆయా టౌన్ హాళ్లను పూర్తిస్థాయి కొలతలతో పరిశీలించి వాటికి సంబంధించిన పూర్తి రికార్డులను తెలుసుకున్నారు. మక్తల్ పట్టణంలో సైతం నూతనంగా నిర్మించబోయే టౌన్ హాల్ ను రవీంద్ర భారతి, సంత్ సేవాలాల్ భవన్ తరహాలో ఎక్కడా రాజీ పడకుండా అత్యాధునిక సదుపాయాలతో తీర్చిదిద్దేలా మంత్రి వాకిటి శ్రీహరి కృషి చేస్తున్నారు. టౌన్ హాల్ ను అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉంచుతూ... అన్ని కార్యక్రమాలు టౌన్ హాల్ లో నిర్వహించేలా పూర్తి సదుపాయాలు అక్కడ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. సంతబజార్ లో నిర్మించబోయే టౌన్ హాల్ ను రాష్ట్ర స్థాయి లో తీర్చి దిద్ది, మఖ్తల్ టౌన్ హాల్ ను బెంచ్ మార్క్ గా నిలిపేందుకు కృషి చేస్తున్నారు. మంత్రి తోపాటు పలు టౌన్ హాల్ లను పరిశీలించిన వారిలో కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ అల్మూరి రవికుమార్, మార్కెట్ డైరెక్టర్ శాలం, మంజూర్ ఇలాహి, ఇతర నాయకులు తదితరులు వున్నారు.

# అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు

**- జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్**



**నర్సాపూర్ మే 22 (జనంసాక్షి):** అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు అందించడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ అన్నారు. నర్సాపూర్ మండల పరిధిలోని ఖాజీపేట్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అర్హులైన పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని,అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తూ ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని తెలిపారు. రెండో విడత జూన్ 2న ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభమవుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో ఖాజీపేట్ సర్పంచ్ యాదగిరి గౌడ్,రెడ్డిపల్లి సర్పంచ్ పద్మావతి అశోక్ గౌడ్, వార్డు సభ్యులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొనారు

# కబడ్డీ సమ్మర్ క్యాంపులో క్రీడాకారులకు పండ్లు పంపిణీ చేసిన సిఆర్పిఎఫ్ జవాన్ మల్లికార్జున్



**లింగాల 22మే (జనంసాక్షి):** జిల్లా యువజన క్రీడల శాఖ నాగర్కర్నూల్ జిల్లా వారి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లింగాల మైదానంలో నిర్వహించినటువంటి కబడ్డీ వేసవి శిక్షణ శిబిరంలో క్రీడాకారులకు సిఆర్పిఎఫ్ జవాన్ మల్లికార్జున్ పండ్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నేను ఇదే స్కూల్లో చదివి ఇదే మైదానంలో ఆడి ఈరోజు ఈ స్థాయికి ఎదిగాను మీరు క్రమశిక్షణతో మెలిగి పట్టుదలతో కష్టపడి మంచి స్థాయిలో ఉండాలని సూచించారు. అదేవిధంగా కబడ్డీ వేసవి శిక్షణ శిబిరంలో ఎంతో కష్టపడి విద్యారుల బౌష్యత్ కోసం ఉపయోగ విధంగా శిక్షణ కోచ్ ఎండి అబ్దుల్లాకి ప్రత్యకమైన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సిఆర్పిఎఫ్ జవాన్ సలేశ్వరం కోచ్‌లో ఎండి అబ్దుల్లా ఉమా హరీష్ నవీన్‌లు పాల్గొన్నారు.

# ఖిల్లాలో యువకుల శ్రమదానం



**ఖిల్లా ఘనపురం,22, మే (జనంసాక్షి):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం స్థానిక క్రీడా ప్రాంగణంలో మండల అధికారులు నాయకులతో కలసి యువకులు శ్రమదానం కార్యక్రమం అట్టవాసంగా ప్రారంభించారు ఈ సందర్భంగా ఎంపిడిఓ స్వయంగా క్రీడా ప్రాంగణంలో ముళ్ళ చెట్లను తొలగించారు వారితో పాటు స్థానిక నాయకులు ఆగారం ప్రకాష్ ,ఉప సర్పంచ్ వార్డు సభ్యులతో కలసి మైదానంలో ఉన్న చెత్త చెదారంను తొలగించారు ఈ సందర్భంగా ఎంపిడిఓ విజయ్ సింహ రెడ్డి శ్రమదానంలో పాల్గొన్న యువకులను ఉద్దేశించి మాట్లాడుతూ శ్రమదానంలో గ్రామస్తులు అందరూ భాగస్వామ్యం కావాలని ఇక నుండి వారానికి ఒక రోజు యువకులు ప్రజా ప్రతినిధులు అధికారులు ఈ శ్రమదానంలో పాల్గొని మన గ్రామ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవడని అందరూ కూడా ముందుకు వచ్చి బాధ్యతగా శ్రమదానంలో పాల్గొనాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆగారం ప్రకాష్,గ్రామ పంచాయతీ కార్యదర్శి రవి,నాగేష్,దీర్ఘాయువు,పాలవది రాజు, సత్యం, బుచ్చి బాబు, గౌడ్,వార్డు సభ్యులు ప్రతాప్,క్యామ వెంకటేష్, దేవేందర్, శ్రీనివాసులు,పవన్ ,శతవువు, వెంకటేష్ అక్కిరి,శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# ఆసరా పింఛన్లకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలి...

**- కల్వకుర్తి మున్సిపాలిటీ 18వ వార్డు కౌన్సిలర్ నాజియా మక్బూల్**



**కల్వకుర్తిరూరల్, మే22, (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేయనున్న ఆసరా పింఛన్లకు కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో అర్హులైన వృద్ధులు, వితంతులు, వికలాంగులు తమ యొక్క ఆధార్ కార్డు, రేషన్ కార్డు సదరన్ సర్టిఫికెట్‌లతో ఈనెల 30వ తేదీ లోపు మున్సిపాలిటీ కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని కల్వకుర్తి మున్సిపాలిటీ 18వ వార్డు కౌన్సిలర్ నాజియా మక్బూల్ ఓ ప్రకటనలో తెలిపారు. మరింత సమాచారం కోసం 9000022244 నంబర్‌పై సంప్రదించాలని మున్సిపాలిటీ కౌన్సిలర్ నాజియా మక్బూల్ కోరారు.

# రెండు రోజుల శిక్షణ శిబిరం ముగింపు




**శ్రీరంగాపూర్ మే 22 (జనంసాక్షి):** శ్రీరంగాపూర్ మండల మహిళా సమైక్యల ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రాణాలికలు బాగా సీనియర్ సిఆర్పిలచే గ్రామ మహిళా సంఘాల ప్రతినిధులు బ్యాంకు రుణాల పట్ల సంఘం యొక్క పంచ సూత్రాలను ప్రభుత్వం మహిళా సంఘాల కల్పించి, జీవనోపాదుల గురించి మహిళా సంఘ సభ్యులకు వీళ్లను వ్యాపారస్తులు చేయాలని చెప్పి సోలార్ గాని పౌల్ట్రీ,గొర్రెల పెంపకం మదర్స్ యూనిట్స్ ఆర్టీసీ బస్సు మొదలగున్నవి ఇలాంటి కార్యక్రమాల పట్ల ప్రభుత్వం ఇప్పటివరకు మహిళలకు అనేక రంగాల్లో చైతన్యం చేస్తూ సామాజిక అంశాల పట్ల సామాజిక బాధ్యత గురించి రకరకాలుగా చేపట్టిన కమిటీల గురించి విస్తృతంగా సంఘ సభ్యులు అవగాహన కల్పించడం జరిగింది. తేదీ 21. 5.2026 నుండి 22. 5.2026 12 గ్రామ సంఘాల ప్రతినిధులు ముగ్గురు చొప్పున హాజరు కావడం జరిగినది. వీరికి సీనియర్ సిఆర్పిసి ఇద్దరు ఇతర జిల్లాల నుండి వచ్చి ఈనెల 25. 05.2026 నుండి 31. 5. 2026 వరకు ఈ కార్యక్రమంలో జరిగే మహిళ వారోత్సవాలకు సంబంధించి శిక్షణ శిబిరం నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ఏపిఎం ఏ చంద్రకళ,సిసి స్వామి,ఎమ్మెస్ అకౌంటెంట్ మహేశ్వరి, ఎమ్మెస్ కంప్యూటర్ ఆపరేటర్ చంద్రశేఖర్ పాల్గొనడం జరిగింది.

# అసంపూర్తిగా ఉన్న 5 ఇండ్ల నిర్మాణానికి ఉప్పల వెంకటేష్ సిమెంట్ అందచేత



**కల్వకుర్తిరూరల్, మే12, (జనంసాక్షి):** కల్వకుర్తి నియోజకవర్గం, కల్వకుర్తి మండలంలోని తోటపల్లి గ్రామంలో అసంపూర్తిగా ఉన్న ఇండ్ల నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శ్రీ ఉప్పల వెంకటేష్ సహకారంతో ఐదు ఇండ్లు 100 బ్యాగులు ఒక్కరికి 20 చొప్పున, బుడ్మ వెంకటమ్మ, బుడ్న లక్ష్మీదేవి, బెక్కరి నరసింహ, పేట బాలయ్య, సల్వరి బసవయ్యకు సిమెంటును అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ జోగు రమణమ్మ సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ రవీందర్ రెడ్డి, వార్డుసభ్యులు పరశురాములు, కళమ్మ, అంజనమ్మ, బంగారయ్య, చంద్రయ్య బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కరెంటు షాక్‌తో వ్యక్తి మృతి



**ఊర్కొండ మే 22, (జనంసాక్షి);** కరెంట్ షాక్ తో వ్యక్తి మృతి చెందిన విషాద ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని నర్సంపల్లి గ్రామంలో కరెంటు షాక్ తగలడంతో పబ్బా బాలయ్య (65) అనే వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. ఇంట్లో మోటార్ పెడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతానికి గురయ్యారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేసినప్పటికీ మార్గమధ్యలోనే ఆయన మృతి చెందడం జరిగింది అని స్థానికులు తెలియజేశారు.

## మండల వనరుల కార్యాలయంకు చేరిన పుస్తకాలు



**కేటిదొడ్డి, మే22 (జనంసాక్షి):** రాబోయే 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం విద్యార్థులకు అందజేసే ఉచిత నోట్ పుస్తకాలు కేటి దొడ్డి మండల వనరుల కేంద్రానికి (MRC) సకాలంలో చేరుకున్నాయి. వేసవి సెలవుల అనంతరం జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో, మొదటి రోజే విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేసేందుకు వీలుగా ప్రభుత్వం ఈ ముందస్తు చర్యలు చేపట్టింది. స్కూళ్లు తెరిచే నాటికే నోట్ పుస్తకాలు అందుబాటులోకి రావడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నోట్ పుస్తకాల పరిశీలన, నిర్వహణ కార్యక్రమంలో మండల కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్స్ (CRPs) శివరాజ్ పాపయ్య పాల్గొన్నారు. వారు పుస్తకాల నిల్వలను పరిశీలించి, జూన్ 12 నాటికి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇవి సకాలంలో అందేలా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

## విధుల పట్ల మున్సిపాలిటీ సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదు

**- కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్**

**- మున్సిపాలిటీ సిబ్బంది హాజరు పట్టిక పరిశీలన**



**కల్వకుర్తిరూరల్, మే22, (జనంసాక్షి):** విధుల పట్ల మున్సిపాలిటీ సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయంలోని వివిధ ఛాంబర్‌లను చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్‌కుమార్, 22వ వార్డు కౌన్సిలర్ కొల్లోజు రాజేష్ కుమార్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ మున్సిపాలిటీ కార్యాలయంలో ఎంత మంది రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. వారి హాజరు శాతం పట్టికను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం చైర్ పర్సన్ మాట్లాడుతూ మున్సిపాలిటీ కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. మున్సిపాలిటీ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహించి ప్రజలకు ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని ఈ సందర్భంగా ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ వెంట మున్సిపాలిటీ కార్యాలయం సిబ్బంది తదితరులు ఉన్నారు.

## గువ్వలదిన్నెలో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం : మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు



**కేటీదొడ్డి, మే22 (జనంసాక్షి):** మండల పరిధిలోని గువ్వలదిన్నె గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గద్వాల మార్కెట్ యార్డ్ చైర్మన్ కుర్వ నల్ల హనుమంతు ముఖ్య అతిథిగా విచ్చేసి, రిబ్బన్ కట్ చేసి ఇండ్లను ప్రారంభించారు. లబ్ధిదారులు మహాదేవి–స్వామి, సంగీత–తిమ్మప్ప దంపతులకు ఆయన ఈ సందర్భంగా ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వం పేదల కోసం అందించిన ఈ గొప్ప అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సొంతింటి కల నెరవేరినందుకు లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు ఉరుకుందు, గ్రామ ఉప సర్పంచ్ మల్లేష్ గౌడ్, నాయకులు గోపాల్ రెడ్డి, యుగంధర్ గౌడ్ తదితరులు పాల్గొని లబ్ధిదారులకు అభినందనలు తెలిపారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు చిత్రపటాలకు పాలాభిషేకం



**మెదక్ మే 22 (జనంసాక్షి):** కార్మిక లోకానికి అండగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చారిత్రాత్మక నిర్ణయం. గత పాలకుల నిర్లక్ష్యానికి తెరదించుతూ. రాష్ట్రంలోని కోటి 11 లక్షల మంది కార్మిక సోదరుల జీవితాల్లో వెలుగులు నింపేలా కనీస వేతనాలను భారీగా పెంచుతూ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది! డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలోని క్యాబినెట్ సబ్ కమిటీ సిఫార్సులతో, కార్మికుల శ్రమకు తగ్గ ప్రతిఫలం అందించేలా జీతాల స్లాబులను సవరించడం జరిగింది. పెరిగిన కొత్త కనీస వేతనాల **వివరాలు:** అన్‌స్కిల్డ్ కార్మికులకు: రూ. 12,750 నుండి రూ. 16,000 లకు పెంపు సెమీ–స్కిల్డ్ కార్మికులకు: రూ. 13,152 నుండి రూ. 17,000 లకు పెంపు! స్కిల్డ్ కార్మికులకు: రూ. 13,772 నుండి రూ. 18,500 లకు పెంపు! హైలీ స్కిల్డ్ కార్మికులకు: రూ. 14,607 నుండి రూ. 20,000 లకు పెంపు! హవేలి ఘనపూర్‌లో సంబరాలు. ఈ చారిత్రాత్మక నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, హవేలి ఘనపూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గుండారం కిరణ్ గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , వివేక్ వెంకటస్వామి , మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మరియు హనుమంతరావు కి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు ఈ కార్యక్రమంలో మండలములోని సర్పంచులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజాపాలనలో వడ్లతో ఇబ్బంది పడుతున్న రైతులు

**- రైతులను పట్టించుకోని కాంగ్రెసు రాష్ట్ర ప్రభుత్వం**

**- సిపిఎం పార్టీ మండల కార్యదర్శి తాడూరు రవీందర్**



**కొమురవెల్లి మే22 (జనంసాక్షి):** ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రైతులను హరిగోశ పెడుతుందని సిపిఎం పార్టీ కొముర వెల్లి మండల కార్యదర్శి తాడూరు రవీందర్ విమర్శించారు ఈరోజు కొమురవెల్లి మండల కేంద్రంలో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రా న్ని మండల కమిటీ ఆధ్వర్యంలో పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కొన్ని మార్కెట్ లో బ స్తాలలో వడ్లు నింపి లారీలు సకాలంలో రాక నింపిన బస్తాలకు చెదలు పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి వడ్ల గింజ కొనుగోలు చేస్తామని రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడమని అధికారులకు ఆదేశించామని గొప్పలు చెప్తున్నారు కానీ మండలంలోనీ ఏ మార్కెట్లలో కూడా కనీసం 40% దాన్యం కూడా కొనుగోలు చేయలేదని రోహిణి కార్తీ వచ్చిందని వర్షాలు పడితే రైతుల బతుకులు ఆ గమ్య గోచరంగా మారుతాయని వడ్లు మార్కెట్లోని తడిచి ముద్దాయితాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి కైనా రాష్ట్ర ప్రభుత్వం మాటలు మాని ధాన్యం కొనుగోలు పైన దృష్టి పెట్టి లారీలు సకాలంలో వచ్చే విధంగా, రైస్ మిల్లుల యాజమాన్యాలు వర్షాకాలం దగ్గర పడ్డ కొద్ది అనేక కొర్రీలు పెడుతూ తాలు, ముక్క ,పేరుతో బస్తకు రెండు నుంచి నాలుగు కిలోలు కట్ చేస్తూ రైతులను నిలువెల్లా ముంచు తున్నారని ఆయన ఆవేద వ్యక్తం చేశారు. ఎటువంటి కొర్రీలు లేకుండా దాన్యం కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అమాలి కార్మికులు ఎండలలో పనిచేసి అనారోగ్యానికి గురి వుతున్నారని కనీసం రాష్ట్ర ప్రభుత్వం వారికి గుర్తింపు కార్డులు ఇచ్చి హెల్త్ ఇన్సూరెన్స్ ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటి సభ్యులు బద్దిపడగ కృష్ణారెడ్డి మండల నాయకులు సార్ల యాదయ్య మ్యకల మల్లేశం తాడూరి ప్రశాంత్ నూకల శ్రీనివాస్ పాకనాటి బాలు తాడూరి భరత్ కుమార్ పుట్ట అంజయ్య రైతులు తదితరులు పాల్గొన్నారు

## పెద్దమల్లా రెడ్డిలో యాక్సిడెంట్..

**- నందిగామ వాసి మృతి**



**నిజాంపేట మే22 (జనంసాక్షి):** కామారెడ్డి జిల్లా భీక్కనూరు మండలం పెద్ద మల్లారెడ్డి శివారులో జరిగిన యాక్సిడెంట్‌లో.. మెదక్ జిల్లా నిజాంపేట మండలం నందిగామ గ్రామానికి చెందిన వీర బోయిన కార్తీక్ (25) అను వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. గతంలో అక్కడే కూలిపని చేసేవాడని, ఆ పనిని మానేసి అక్కడ ఉన్నటు వంటి దుస్తులను తీసుకురావడానికి వెళ్లిన సందర్భంలో ఘటన చోటు చేసుకుందన్నారు. అందరితో కలివిడిగా ఉండే కార్తీక్ మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతునికి కుమార్తె కుమారుడు ఉన్నారు.

## మద్యం తాగి వేహికల్ నడిపిన వ్యక్తికి పదివేల జరిమానా

**- కొల్చారం ఎస్ఐ మహమ్మద్ మొయినుద్దీన్**



**కొల్చారం, మే 22, (జనంసాక్షి):** కొల్చారం ఎస్సై మహమ్మద్ మొహినోద్దీన్ సిబ్బందితో కలిసి తేదీ 21.05.2026 సాయంత్రం ఏడుపాయల టీ జంక్షన్ వద్ద ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా జోగిపేట పట్టణానికి చెందిన బి.ప్రవీణ్ మద్యం తాగి వెహికల్ నడుపుతుండగా పట్టుకొని అట్టి వ్యక్తికి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష నిర్వహించి అట్టి వ్యక్తి శుక్రవారం మెదక్ కోర్టుకు పంపగా మెదక్ మెజిస్ట్రేట్ పూర్తి విచారణ జరిపి మద్యం తాగి వెహికల్ నడిపిన వ్యక్తికి పదివేల జరిమానా విధించారని కొల్చారం ఎస్ఐ మహమ్మద్ మోహీనుద్దీన్ తెలిపారు.

## పాముకాటుతో బాలుడు మృతి



**నర్సాపూర్ మే 22 (జనంసాక్షి):** పాముకాటుతో ఓ బాలుడు మృతి చెందిన సంఘటన మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం ఎల్లాపూర్ గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది ఎస్సై రంజిత్ కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కౌడిపల్లి మండలం సలావత్ పూర్ గ్రామానికి చెందిన సునావత్ రాజు అతని భార్య జ్యోతి వేసవి సెలవులు ఉండడంతో ఇద్దరు కుమారులు మహేష్, రాకేష్ నర్సాపూర్ మండలం ఎల్లాపూర్ గ్రామంలోని శరత్ రెడ్డి వ్యవసాయ భూమిలో మామిడి తోటలో పనిచేయడానికి వచ్చారు ఆ తోటలో ఉండడానికి వారికి ఒక రూమ్ ఇవ్వగా అక్కడే ఉంటూ పని చేసుకుంటున్నారు. గుర్తుతెలియని విషపూరితమైన పాము కాటు వేయడంతోనే తన కుమారుడు మృతి చెందాడని తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నాడు.

## ఏడుపాయల్లో నీట మునిగి..



**పాపన్నపేట, మే 22 (జనంసాక్షి) :** ప్రమాదవశాత్తూ నీట మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన విషాద సంఘటన మెదక్ జిల్లాలో వెలుగు చూసింది. పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాలు .. కంకరి నాగరాజు (31) ఏడుపాయల చెక్ డ్యాం సమీపంలో స్నానం చేయడానికి నీటి లోకి దిగాడు. స్నానం చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తూ నీట మునిగాడు. కాసేపటికి అటుగా వెళ్లిన స్థానికులు ఒడ్డుపై ఉన్న చెప్పులు,బట్టలు,ఫోన్ ను గుర్తించి పోలీసులకు,కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి మాణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

# కుదేలైన రియల్ ఎస్టేట్ రంగం - జనాలపై భారం

- రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువ పెంచడంతో ప్రభుత్వం వైఫల్యానికి నిదర్శనం
- ఆదాయంపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై ఎందుకు లేదు
- భారీగా రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువ పెంపుకు కాంగ్రెస్ కుట్ర
- బిజెపి రాష్ట్ర నాయకుడు మున్నూరు రవీందర్ ఆరోపణ

**వనపర్తి బ్యూరో మే 22 (జనంసాక్షి):**
తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు రియల్ ఎస్టేట్ రంగం కుదేల్ అయిందని మళ్లీ రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువ పెంచి ఈ రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగని కనుమరుగు చేసే కుట్ర చేస్తుందని బిజెపి రాష్ట్ర నాయకుడు సీనియర్ న్యాయవాది మున్నూరు రవీందర్ ఆరోపించారు. ప్రభుత్వం రైతాంగ సమస్యలను పరిష్కరించకుండా రైతులకు సంబంధించిన భూ సమస్యలను ముఖ్యంగా అసైన్డ్ భూముల సమస్యను పక్కన పెట్టి ధరల మీద ధరలు పెంచుకుంటూ పేద మధ్యతరగతి ప్రజల నెత్తిన బండ మోపుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జూన్ 2 తర్వాత రాష్ట్రంలో ఒకపక్క భూముల ధరలు, రిజిస్ట్రేషన్ ధరలు మరోపక్క మద్యమం విక్రయాలపై ధరల భారం మోపడానికి కాంగ్రెస్ చేస్తున్న కుట్రను ప్రజలు తిప్పి కొట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మద్యం ధరలు 10 శాతం నుంచి 15 శాతం వరకు పెంచుతుందని ముఖ్యంగా ఒకొక్క బాటిల్ పైన 20 రూపాయల నుంచి 60 రూపాయల చొప్పున వసూలు చేసే కార్యక్రమానికి కాంగ్రెస్ శ్రీకారం చుట్టిం దని అన్నారు. ప్రీమియం బ్రాండ్లపై 100 రూపాయల నుంచి 120 రూపా యల వరకు పెంచి ఆదాయం అమ్మకుచ్చుకోవడానికి ఖజానాకు నిధులు సమీకరించి దిశగా ఈ ప్రభుత్వం ధరలు ఎంతవరకు సమంజసమని ప్రశ్నిం చారు. అదేవిధంగా రిజిస్ట్రేషన్ చార్జీలు కూడా 20 శాతం వరకు పెంచుతూ భూముల మార్కెట్ విలువ పెంచడం వల్ల ఆస్తి రిజిస్ట్రేషన్ స్టాంప్ డ్యూటీ చార్జీలపై అదనపు భారం పడుతుందని పట్టణ ప్రాంతాల్లో మొత్తం రిజిస్ట్రేషన్ చార్జీలు 6% వరకు ఉంటే స్టాంపు డ్యూటీ 5.5% శాతం రిజిస్టర్ ఫీజు 0.5% బదిలీ సుంకం 1.5 శాతంతో పాటు గ్రామీణ ప్రాంతాలలో గ్రామపంచాయతీ గ్రామాలలో మొత్తం చార్జీలు 7.5% వసూలు చార్జీలు మోత మోగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సవరణ ద్వారా రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలు కావడమే కాక ఆస్తి కొనుగోలుదారుల పై అదనపు భారం పడు తుందని రిజిస్ట్రేషన్ చార్జీలు భూముల మార్కెట్ విలువ పెంపుతో ప్రభుత్వానికి 250 కోట్ల నుంచి 300 కోట్ల వరకు ప్రతినెల ఆదాయం వస్తుందని అన్నారు. అంచనాలు పూర్తిగా అసంబద్ధం. అసలు రిజిస్ట్రేషన్ జరిగితే కదా? అసలు రిజిస్ట్రేషనులు జరిగితే కదా? కుదేలైన రొయల్ ఎస్టేట్ రంగం కోలుకుంటే కదా? యల్ ఎస్టేట్ రంగం కోలుకుంటే కదా? ప్రభుత్వం ఆదాయం కోసం చూపిస్తున్న శ్రద్ధ ఈ రాష్ట్రంలో అభివృద్ధి పైన సంక్షేమ పథకాల అమలుపైన ఎందుకు చిత్తశుద్ధి చూపడం లేదని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికే ఎన్నికల ముందు అమలు కానీ హామీలు ఇచ్చిన ప్రభుత్వం ఒక్కటి కూడా అమలు చేయలేదని రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతుందని అన్నారు. 100 స్థలాల ఇంటి స్థలం కొనుగోలు చేస్తే ఆ వ్యక్తి ప్రస్తుతం చెల్లిస్తున్న సుమారు 56,200 రిజిస్ట్రేషన్ ఖర్చులు బదులుగా సవరణ తర్వాత ఏకంగా 73 ,125 రూపాయలకు పైగా చెల్లించవలసిన దుస్థితి దౌర్భాగ్య పరిస్థితి ఈ కాంగ్రెస్ తెస్తుందని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రతి గజం స్థలానికి 25 వేల నుంచి 60 వేల వరకు పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయని ధరల పెంపు అమల్లోకి రాకముందే ప్రజలు భయభ్రాంతులకు గురవుతూ పెరుగుతున్న ధరలను తట్టుకోలేక రిజిస్టర్ కార్యాలయాల చుట్టూ గతంలో ఉన్న రిజిస్ట్రేషన్ చార్జీలు చెల్లించి రిజిస్టర్లు చేసుకోవడానికి బారులు తీరుతూ పెద్ద సంఖ్యలో రిజిస్టర్ కార్యాలయాల్లో కనిపిస్తున్నారని అన్నారు. ఈ విధంగా భూముల ధరలు రిజిస్ట్రేషన్ ధరలు మద్యం ధరలు పెంచుతూ ఇప్పటికే మీ-సేవ కేంద్రాలలో ఫీజులను పెంచడం వల్ల మీ-సేవ లు రైతులకు విద్యార్థులకు నిరుద్యోగులకు




అందడం లేదని మీ-సేవ కేంద్రాల రిజిస్ట్రేషన్ ధరలను వెంటనే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో ఈ రాష్ట్రంలో ధరల పెరుగుదల పరంపరం కొనసాగుతుందని చెప్పడంలో సందేశం లేదని అన్నారు. గత ప్రభుత్వం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా చేశారని రైతులకు కనీసం గిట్టుబాటు ధర కూడా కల్పించకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించడంలో ఈ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తూకాలలో మోసాలు తరుగు తీస్తున్నారని రైతులు రోడ్లపై ఆందోళన చేస్తే కూడా ఈ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని మున్నూరు రవీందర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వచ్చే వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం రైతాంగ సమస్యలను పరిష్కరించాలని పంట రుణాలను రీ షెడ్యూలు చేస్తూ తిరిగి రైతులకు బ్యాంకుల ద్వారా పంట రుణాలను ఇప్పించాలని అతివృష్టి అనావృష్టితో నష్టపోయిన రైతులను అన్ని విధాల ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పెంచిన భూముల విలువను రిజిస్ట్రేషన్ చార్జీలను కూడా తగ్గించాలని లేనిపక్షంలో రాబోయే రోజుల్లో ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి శంకరగిరి మాన్యాలు తప్పవని ఆయన జోషం చెప్పారు. అంతేకాక వచ్చే నూతన విద్యా సంవత్సరం దృష్టిలో పెట్టుకొని విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఇప్పటికి పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్మెంట్ డబ్బులను వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## దళితుల అభ్యున్నతికి విశేష కృషి చేసిన మహానీయుడు భాగ్యరెడ్డి వర్మ

- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి

**వనపర్తి బ్యూరో మే 22 (జనంసాక్షి):**
దళితుల అభ్యున్నతికి విశేష కృషి చేసిన మహా నీయుడు భాగ్యరెడ్డి వర్మ అని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి పేర్కొన్నారు.
శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో భాగ్యరెడ్డి వర్మ జయంతిని పురస్క రించుకొని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

**ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...**
దళితుల అభ్యున్నతికి అనగారిన వర్గాల శ్రేయస్సు కోసం భాగ్య రెడ్డి వర్మ కృషి చేశారన్నారు. బాల్య వివాహాలు, అంటరానితనం, దేవదాసి, జోగిని వ్యవస్థలను రూపు మాపేందుకు పోరాటం చేశారని కొనియాడారు. దళిత ఉద్యమ పితా మహుడిగా, సంఘ సంస్కకర్తగా భాగ్యరెడ్డి ప్రజల గుండెల్లో చిర స్థాయిగా నిలిచారని, సమాజంలో దళి తుల చైతన్యం కోసం అహర్ని శలు శ్రమించారన్నారు.



**కలెక్టర్ మాట్లాడుతూ...**
మహానుభావుల జయంతి వేడు కలను ప్రభుత్వం అధికారికం గా నిర్వహించడం సంతోష కరమని, మహానీయుల చరిత్ర, త్యాగాలను బావితరాలకు అందించడం ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని, దేశ భవిష్యత్తు, ప్రజల సంక్షేమం కోసం మహానీయులు ఆచరిం చిన మార్గాలను బావితరాలకు అందిస్తూ ముం దుకు తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థ లు ఖీమ్య నాయక్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రాంజీ రావు, మహనీయుల ఉత్సవ కమిటీ ఛైర్మెన్ గంధం నాగరాజు ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు, రవాణా వేగవంతం చేయాలని ఏదుల ఎమ్మార్వో కు వినతి పత్రం

- క్వింటాలకు 6 నుంచి 8 కిలోల తరుగు పేరుతో మిల్లర్ల దోపిడి
- బిజెపి మండల అధ్యక్షుడు కుందేళ్ళ రాములు యాదవ్

**రేవల్లి, మే 22 (జనంసాక్షి):**
రైతులు నాలుగు నెలల పాటు కష్టపడి పండించిన పంటను ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి కొనుగోలు ప్రారంభించి, రవాణా వేగవంతం చేయాలని బిజెపి ఏదుల మండల అధ్యక్షుడు కుందేళ్ళ రాముడు యాదవ్ మండల తహసీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల దగ్గర ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించడానికి రవాణా సౌకర్యార్థం లారీలు కొనుగోలు కేంద్రాల కు రాకపోవడం తో రైతులు అరిగోస పడుతున్నారని అన్నారు. కానీ ప్రభుత్వానికి మాత్రం రైతుల విషయంలో చీమకుట్టినట్టుగా లేదని కొనుగోలు కేంద్రాలకు లారీలను పంపకపోవడం రైతుల పట్ల ప్రభుత్వ వైఫల్యాలకు నిదర్శనమని ధ్వజమెత్తారు. రైసు మిల్లుల దగ్గర తరుగు పేరుతో క్వింటాలకు 6 నుంచి 8 కిలోలు తరుగు తీస్తూ రైతులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. కావున అధికారులు స్పందించి తరుగు పేరుట రైతులను మోసం చేస్తున్న మిల్లర్లపై తగు చర్యలు




తీసుకోవాలని, కొనుగోలు కేంద్రాలకు సరైన సమయంలో లారీలను పంపి ధాన్యం తరలింపును యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఉద్యమం చేపడతామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

## ఆసరా పింఛన్లకు అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలి

- కల్వకుర్తి మున్సిపాలిటీ 10వ వార్డు కౌన్సిలర్ షేక్ ఏజాస్

**కల్వకుర్తిరూరల్, మే12, (జనంసాక్షి):**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేయనున్న ఆసరా పింఛన్లకు కల్వ కుర్తి మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు లో అర్హులైన వృద్ధులు, వితంతులు, విక లాంగులు తమ యొక్క ఆధార్ కార్డు,రేషన్ కార్డు, సదరన్ సర్టిఫికెట్,బ్యాంక్ పాస్ బుక్,పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో ఈనెల 22 నుంచి 30వ తేదీలోపు నేరుగా మున్సిపాలి టీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని



10వ వార్డు కౌన్సిలర్ షేక్ ఏజాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని అన్నారు. ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేయనున్న ఆసరా పింఛన్ల పథకానికి అర్హులైన లబ్ధిదారులు మరింత సమాచారం కోసం 9966386787 నంబర్ పై సంప్రదించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

## రాష్ట్ర ఓబిసి మోర్చాను సన్మానించిన బిజెపి నాయకులు

**నారాయణపేట మే22 (జనంసాక్షి):** రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షు డుగా నియమితులైన కే.రఘు రామయ్య గౌడ్‌ను శుక్రవారం నారాయణపేట లోని ఆయన నివాసంలో



బిజెపి పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ నందు నామా జీ, మున్సిపల్ కౌన్సిలర్ కే.ప్రభాకర్, పట్టణ బిజెపి కోశాధికారి హన్మంతు రావు, ఓబీసీ మోర్చా జిల్లా నాయకుడు ఉమాకాంత్ శాలువా కప్పి సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రఘు రామయ్య గౌడ్ మాట్లాడుతూ మీ అందరి సహకారంతో పార్టీని మరింత బలోపేతం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అంటరానితనానికి వ్యతిరేకంగా భాగ్యరెడ్డి వర్మ పోరాటం



**గద్వాల నడిగడ్డ, మే22 (జనంసాక్షి);** అంటరానితనం, వివక్షకు వ్యతిరేకంగా భాగ్యరెడ్డి వర్మ పోరాటం చేశారని రెవిన్యూ అదనపు కలెక్టర్ మధుమోహన్ అన్నారు. శుక్రవారం దళిత వైతాళికుడిగా ప్రసిద్ధి చెందిన భాగ్యరెడ్డి వర్మ 138వ జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్ వద్ద ఆయన చిత్రపటానికి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ నర్సింగరావుతో కలిసి ముఖ్య అతిథిగా హాజరైన మధుమోహన్ మాట్లాడుతూ మహనీయుల జీవితం నుంచి స్ఫూర్తి పొందడానికి, వారు సమాజానికి చేసిన సేవలను గుర్తు చేసుకోవడానికి ప్రభుత్వం ఏటా భాగ్యరెడ్డివర్మ లాంటి గొప్పవారి జయంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. భాగ్యరెడ్డి వర్మ హైదరాబాదు సంస్థానంలో 26 దళిత బాలి కల పాఠశాలలను స్థాపించి వారి అభ్యున్నతికి కృషి చేశారని కొనియాడారు. మనదేశంలో కులవివక్షను ఎదుర్కొని గొప్ప స్థాయికి చేరుకున్న మహనీయులు ఎందరో ఉన్నారని, వారిలో భాగ్యరెడ్డి వర్మ ఒకరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నుషిత, బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ బాషా, సర్వే ఏడి నూకరాజు, కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్లపై తక్షణ చర్యలు తీసుకోవాలి

**- మక్తల్ టౌన్ బిజెపి కార్యదర్శి బ్యాటరీ రాజు**



**మక్తల్, మే 22 (జనంసాక్షి):** మక్తల్ నియోజకవర్గం, మాగనూరు మండలం పరిధిలోని ఓబులాపురం వాగు, దాసరి పల్లి వాగు నుండి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్ల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టిప్పర్లు తాటిపత్రులు లేకుండా ఇసుకను రవాణా చేస్తున్నారు. ఓవర్‌లోడ్‌తో, ఓవర్‌స్పీడ్‌గా రోడ్లపై నిర్లక్ష్యంగా నడుపుతున్నారు. ఇసుక రేణువులు ఎదురుగా వచ్చే ద్విచక్ర వాహనదారుల కళ్లలో పడుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఇప్పటికే పలువురు వాహనదారులు కిందపడి గాయపడిన సంఘటనలు జరిగినట్లు ప్రజలు చెబుతున్నారు. ఇసుక మాఫియా తమ లాభాల కోసం అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న పరిస్థితి ఏర్పడింది. అనుమతులు ఉన్న వాహనాలు మాత్రమే నిబంధనలకు లోబడి తాటిపత్రులు కప్పి రవాణా చేయాలని, అక్రమంగా నడుస్తున్న టిప్పర్లను వెంటనే సీజ్‌చేసి, సంబంధిత యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సంబంధిత అధికారులు ఇసుక అక్రమ రవాణా ను అరికట్టాలని మక్తల్ టౌన్ బిజెపి కార్యదర్శి బ్యాటరీ రాజు డిమాండ్ చేశాడు.

## 99 రోజుల ప్రజాపాలనలో భాగంగా శ్రమదాన కార్యక్రమం



**బెజ్జంకి,మే 22,(జనంసాక్షి):** మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో గ్రామ సర్పంచ్ బొల్లం శ్రీధర్(పెద్దన్న) ఆధ్వర్యంలో శ్రమదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, విద్యార్థులకు స్వచ్ఛమైన వాతావరణం కల్పించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సర్పంచ్ బొల్లం శ్రీధర్ తెలిపారు.కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో పెరిగిన చెట్లును,చెత్తను తొలగించి పరిశుభ్రత పనులు నిర్వహించారు.గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని సర్పంచ్ బొల్లం శ్రీధర్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఉప సర్పంచ్ ధూమాల మహేష్ మాట్లాడుతూ గ్రామంలో పచ్చదనం-పరిశుభ్రత,వాటి యొక్కపరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని,ప్రజా పాలన కార్యక్రమాల ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులు మరింత వేగవంతంగా కొనసాగుతున్నాయి అని అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు భోనగం రమేష్,దొంతర వేణి అంజలి శ్రీనివాస్,తిప్పారపు మహేష్,పొట్లపల్లి శివ,పంచాయతీ కార్యదర్శి ప్రణీత్ రెడ్డి, ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షుడు బోనగిరి చంద్రయ్య,విద్యా కమిటీ మాజీ చైర్మన్ బోనగిరి లింగయ్య శ్రమదానంలో భాగస్వాములయ్యారు.

# కార్మికులకు వేతనాలు పెంచడం అభినందనీయం

- ముఖ్యమంత్రికి చిత్రపటానికి పాలాభిషేకం
- కాంగ్రెస్ కార్యకర్తల నడుమ అంబరాన్ని అంటేలా సంబరాలు
- సంక్షేమ పథకాలు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం



**కౌడిపల్లి మే 22, (జనంసాక్షి):** మెదక్ జిల్లా మండల కేంద్రమైన కౌడిపల్లిలో శుక్రవారం మండల పార్టీ అధ్యక్షులు పట్లూరి శ్రీనివాస రావు, కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఘనంగా పూలమాలలు వేసి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసరావు, మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజలందరినీ దృష్టిలో పెట్టుకొని బడుగు బలహీన వర్గాలకు బిసిలకు వయో పరిమితి పెంపుదల 37 సంవత్సరాల నుంచి 44 సంవత్సరాల వరకు కనీస వేతనం 15వేల నుండి 25వేల వరకు పెంపుదల సాహసోపేత నిర్ణయం అన్నారు. బడుగు బలహీన వర్గాలకు ఇదొక పెద్ద వరమన్నారు. వేతనాల పెంపుదల అనేది రాష్ట్ర ప్రజలందరికీ పెద్దవరంగా భావిస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఎక్కడికక్కడ ముఖ్యమంత్రి చిత్రపటానికి పూలమాలలు వేసి పాలాభిషేకం చేసి టపాసులు పేల్చి సంబరాలు చేసుకోవడం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా ఈసారి యాసంగి పంటలు రికార్డు స్థాయిలో మునుపెన్నడూ లేని విధంగా దాదాపు కొన్ని మెట్రిక్ టన్నులలో రైతులకు పంట చేతికి రావడం జరిగిందన్నారు. గతంలో బిఆర్ఎస్ పాలనలో వరి వేస్తే ఉరి అన్న నాయకులు, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కు దీటుగా రేవంత్ రెడ్డి, యావత్ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న రైతులు వరి ధాన్యం వేయండి మొదటి గింజ నుండి చివరిగింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేసేలా రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. ఈరోజు వరిధాన్యం రికార్డు స్థాయిలో రైతుల చేతికిరావడం జరిగిందన్నారు. మన మెదక్ జిల్లాలో 30 బాయిల్ రైస్ మిల్లులు మాత్రమే ఉన్నాయి అన్నారు. 30 రైస్ మిల్లులకు మాత్రమే ఈ ధాన్యమంతా చేరవేయడం జరుగుతుందన్నారు. రారైస్ మిల్క్ ఈ ధాన్యం పనిచేయదు నూక శాతం ఎక్కువ అవుతున్న సందర్భాలు ఎక్కువ ఉన్నందున దయచేసి రైతులందరూ ఓపిక పట్టండి ప్రతి ఒక్కరి దగ్గర మొదటి గింజ నుండి చివరి గింజ వరకు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది మీరు అధైర్య పడవద్దు అన్నారు. ఈ రోజు ఆవంచలో నూతన గోదాం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. సుమారు 400 లారీల ధాన్యం అక్కడ దిగుమతి చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ రాష్ట్ర ప్రజల మన్ననలు పొందుతుందన్నారు. ఇచ్చిన హామీలలోప్రతి ఒక్కరికి పెన్షన్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఇందిరమ్మ ఇల్లులు, పేదోడి సొంతింటి కల సహకారం చేసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుంది అన్నారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాహుల్ గాంధీకి, ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీలోకపల్లి లక్ష్మమ్మ ఆలయ నూతన కమిటీ ఎన్నిక

**- అధ్యక్షులుగా జి.శశికాంత్ యాదవ్**



**నారాయణపేట మే 22(జనంసాక్షి):** నారాయణపేట మండలం లోకాపల్లి శ్రీ లక్ష్మమ్మ ఆలయ నూతన కమిటీనీ శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఆలయ కమిటీ నూతన అధ్యక్షునిగా శశికాంత్ యాదవ్, ఉపాధ్యక్షులుగా కూరగాయల రవికుమార్ గౌడ్ కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. భవిష్యత్తులో శ్రీ శ్రీ లోకాయపల్లి లక్ష్మమ్మ దేవాలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యార్థం అనేక ఏర్పాట్లు, భక్తి రంజకమైన కార్యక్ర మాలను చేపడతామని ఇట్టి అవకాశం కల్పించిన సభ్యులందరికీ ఆలయ కమిటీ అధ్యక్షులు శశికాంత్ యాదవ్, ఉపాధ్యక్షులు కూరగాయల రవికుమార్ గౌడ్ ధన్యవాదాలు తెలిపారు.అంతకు ముందు ఆలయ గౌరవ అధ్యక్షుడు హరినారాయణ భట్టడా అధ్యక్షతన సమావేశం జరిగింది.ఈ సమావేశంలో 2025-2026 వార్షిక ఆదాయ వ్యయాలని కోశాధికారి లప్ప అశోక్ చదివి వినిపించగా ఆమోదించారు.ఈ సందర్భంగా కార్యక్రమంలో ఆంజనేయ స్వామి శిఖర నిర్మాణమునకు లక్ష విరాళం అందించిన నారాయణపేట గాల సిద్దమ్మ ను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమం లో ఉపాధ్యక్షులు కన్నా జగదీష్ , ప్రధాన కార్యదర్శి, వేముల మధుసూదన్ రెడ్డి, కోశాధికారి లప్ప అశోక్ , సహకార దర్శి ఆర్ భాస్కర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ గౌడ్, కమిటీ ఈ సి సభ్యులు పిల్లి నరసింహులు, సంతోష్ నామాజీ, కమిటీ సలహాదారుడు ఆత్మారాం హెడ్గె, మరియు మహిళా కమిటీ సభ్యులు సంధ్యారాణి వెంకటరమణ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసిన మహనీయుడు

- నర్సాపూర్‌లో ఘనంగా పర్స సత్యనారాయణ 11వ వర్ధంతి
- సిఐటియు జిల్లా కార్యదర్శి ఏ.మలేశం



**నర్సాపూర్ మే 22 (జనంసాక్షి):** కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించి, ప్రజాల పక్షాన అసెంబ్లీ లో మాట్లాడిన గొప్ప నాయకులు పర్స సత్యనారాయణ అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశం కొనియాడారు. శుక్రవారం నర్సాపూర్ ఎల్లంకి కళాశాల లో సీఐటీయూ ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటుకు ముఖ్య అతిథిగా హాజరై పర్స సత్యనారాయణ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటసుబ్బమ్మ, వెంకమరాజు నిరుపేద దంపతులకు జన్మించిన పర్స సత్యనారాయణ 19 ఏండ్ల వయసులోనే కార్మికోద్యమంలో అంతర్గత నాయకుడిగా పరిస్థితి చేస్తూ సిఐటియూ ఆవిర్భావంలో ముఖ్య పాత్ర పోషించరన్నారు. కార్మికోద్యమంలో క్రియాశీలంగా పనిచేస్తున్న ప్రజల పక్షాన పోరాటాలుకూడా నిర్వహించారాని, అదే సమయం ఎమ్మెల్యే గా గెలిచి ప్రజా గొంతును అసెంబ్లీ లో వినిపించిన నాయకుడు పర్స సత్యనారాయణ అన్నారు. ఆయన 2015 లో మరణించిన ఆయన పోరాటాలు ఇప్పటికి ఎప్పటికి చరిత్రలో మిగిలింటాయని గుర్తుచేసారు. ఈ కార్యక్రమం లో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు, నాయకులు నర్సింలు, చెంద్రయ్య, రుబ్బీ, సత్యనారాయణ, పెంటయ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## లిఫ్ట్ అడిగి నిలువుదోపిడీ.. ఇద్దరు నిందితుల అరెస్ట్

**- డీఎస్పీ వెంకటేశ్వర్లు**



**జడ్చర్ల, మే 22 (జనంసాక్షి):** సహాయం కోరినట్లు నటించి బైక్‌పై లిఫ్ట్ అడిగి, ఆపై నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి ఓ ప్రైవేట్ ఉద్యోగిని తీవ్రంగా గాయపరిచి నిలువుదోపిడీ చేసిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు మహబూబ్ నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇన్‌స్పెక్టర్ కమలాకర్‌తో కలిసి ఆయన కేసు వివరాలను వెల్లడించారు. కడప జిల్లాకు చెందిన బాధితుడు సంజీవ ఈ నెల 19న రాత్రి జడ్చర్ల బస్టాండ్ సమీపంలో వెళ్తుండగా, తమ పోలీస్ వాహనం చెడిపోయిందని అబద్ధం చెప్పి ఓ వ్యక్తి లిఫ్ట్ అడిగాడు. అతని మాటలు నమ్మి స్కూటీపై ఎక్కించుకోగా, నిందితుడు నక్కలబండ తండా సమీపంలోని వెంచర్‌లోకి తీసుకెళ్లాడు. అక్కడ ముందే ప్లాన్ చేసుకున్న మరో నిందితుడితో కలిసి బాధితుడిని కట్టెతో కొట్టి తీవ్రంగా గాయపరిచారు. అతని వద్ద ఉన్న రూ. 2 వేల నగదుతో పాటు, ఫోన్ లాక్కొని ఫోన్‌పే ద్వారా రూ. 36,690 తమ ఖాతాకు బదిలీ చేయించుకుని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు, జిల్లా ఎస్పీ జానకి ఆదేశాల మేరకు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు శుక్రవారం ఉదయం జడ్చర్ల ఫ్లైఓవర్ కింద తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న మహబూబ్‌నగర్‌కు చెందిన అప్పన్న (20), బి.రాకేష్ (20) లను అదుపులోకి తీసుకుని విచారించారు.

జల్సాలకు అలవాటు పడే ఈ దోపిడీకి పాల్పడినట్లు నిందితులు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 29 వేల నగదు, నేరానికి ఉపయోగించిన స్కూటీ, ఒక సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

కేసును చాకచక్యంగా ఛేదించిన జడ్చర్ల ఇన్‌స్పెక్టర్ కమలాకర్, సిబ్బంది విష్ణుమూర్తి, నరసింహరాజులను జిల్లా ఉన్నతాధికారులు అభినందించారు.

## ఏసీబీ వలలో చిక్కిన విద్యుత్ శాఖ ఏడిఈ



**నర్సాపూర్ మే 22 (జనంసాక్షి):** కాంట్రాక్టర్ నుండి లంచం తీసుకుంటుండగా విద్యుత్ శాఖ ఏడిఈ శుక్రవారం ఏసీబీ అధికారులకు చిక్కారు. ఏసీబీ డి.ఎస్.పి కె.సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం 2023 నుండి 2025 వరకు ఓ కాంట్రాక్టర్ 11 ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్లకు సంబంధించిన 3 లక్షల 15 వేల పనులు పూర్తి చేయడం జరిగింది. వీటి బిల్లులు ఫార్వర్డ్ చేయడానికి సదరు కాంట్రాక్టర్ ను నర్సాపూర్ ఏడిఈ రమణారెడ్డి 30,000 లంచం డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఈనెల 20వ తేదీన కాంట్రాక్టర్ మెదక్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఇది నిజమా కాదా అని తెలుసుకోవడానికి కాంట్రాక్టర్ ను ఏడిఈ దగ్గరకు పంపగా 20 లేదా 25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. కాంట్రాక్టర్‌తో డబ్బులు పంపించగా ఏడీఈ రమణారెడ్డి తీసుకోగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడం జరిగింది. ఇంకా ఇలాంటి అవినీతికి పాల్పడ్డాడని అనుమానంతో అతని ఇంటిని సెర్చ్ చేయడం జరిగింది. లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఏడిఈ రమణారెడ్డిని కోర్టులో ప్రొడ్యూస్ చేస్తామని ఎసిబి డిఎస్పి సుదర్శన్ వెల్లడించారు. ఎక్కడైనా ప్రభుత్వ అధికారులు లంచం అడిగితే 1064 టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ దాడుల్లో ఇన్స్పెక్టర్లు వెంకటేష్, రమేష్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## పచ్చిరొట్టె విత్తనాలతో అధిక దిగుబడి

**- ఆత్మ కమిటీ చైర్మన్ తిరుపతి, ఏఓ భోగేశ్వర్**



**చేర్యాల, మే 22(జనంసాక్షి) :** పచ్చి రొట్టె విత్తనాలతో అధిక దిగుబడి లభిస్తుందని చేర్యాల ఆత్మ కమిటీ చైర్మన్ జక్కుల తిరుపతి, చేర్యాల మండల వ్యవసాయ అధికారి పులి భోగేశ్వర్ రైతులకు సూచించారు. శుక్రవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీతో పచ్చి రొట్టె ఎరువులు, జీలుగ, జనము విత్తనాలు సరఫరా కార్యక్రమాన్ని స్థానిక అగ్రోస్ రైతు సేవా కేంద్రం ప్రతినిధి పర్వాటకం చంద్రారెడ్డి షాప్ ముందు పంపిణీ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పచ్చి రొట్టె, జనము విత్తనాల వల్ల భూమి సారవంతంగా మారుతుందని భూమి రసాయన కాలుష్యం తగ్గించునని, పంట అధిక దిగుబడి ఉంటుందని తెలిపారు. 40 కిలోల బ్యాగ్ కు రూ.3110 ధరకు లభిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## పెంపు హర్షించి.. క్షీరాభిషేకం నిర్వహించి



**పాపన్నపేట, మే 22 (జనంసాక్షి):** రాష్ట్రంలోని కోటి మందికి పైగా కార్మికులకు మేలు జరిగేలా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం వేతనాల పెంపు నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నరేందర్ గౌడ్ అన్నారు. శుక్రవారం పాపన్నపేట లోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద సీఎం రేవంత్ రెడ్డి,కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి,ఎమ్మెల్యే రోహిత్ రావు చిత్రపటాలకు హస్తం శ్రేణులతో కలిసి ఆయన క్షీరాభిషేకం చేశారు. అనంతరం మాట్లాడారు. ఈనిర్ణయం పేద కార్మిక కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు తోడ్పడుతుందన్నారు. ఈకార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు నీరుడి వెంకటేశం, సర్పంచులు సిద్దప్ప, శ్రీధర్, శ్రీనివాస్, శ్రీశైలం, ఉపసర్పంచ్ సద్దాంహుస్సేన్, నాయకులు హీరాలాల్, ఖలీమ్, కిష్టయ్య,సంగమేశ్వర్, శివయ్య,ఇబ్రహీం, రాజు పాల్గొన్నారు.

## కావేరమ్మపేట సబ్‌స్టేషన్ పరిధిలో నేడు విద్యుత్ నిలిపివేత

**- విద్యుత్ శాఖ ఏఏఈ వెంకటయ్య**



**జడ్చర్ల, మే 22 (జనంసాక్షి):** జడ్చర్ల గ్రామీణ విద్యుత్ శాఖ పరిధిలోని కావేరమ్మపేట సబ్‌స్టేషన్ పరిధిలో నేడు శనివారం (మే 23) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ ఏఏఈ వెంకటయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ కావేరమ్మపేట ఫీడర్ పరిధిలో అత్యవసర నిర్వహణ పనులు, నూతన లైన్ పనులు చేపట్టడంతో పాటు, లైన్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు ఉదయం 11:30 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు లైన్ క్లియర్ తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కారణంగా కావేరమ్మపేట, మచారం, బస్టాండ్ పరిసర ప్రాంతాలు, హౌసింగ్ బోర్డ్, పోలీస్ స్టేషన్ పరిధిలోని గృహ వినియోగదారులకు, అలాగే 11 కేవీ స్థాయి పారిశ్రామిక కంపెనీలకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది. వీటితో పాటు జడ్చర్ల గ్రామీణ మండలం పరిధిలోని పలు సబ్‌స్టేషన్ల పరిధిలో కూడా ఈ ఒకటిన్నర గంటల పాటు కరెంట్ ఉండదని స్పష్టం చేశారు. విద్యుత్ లైన్ల పటిష్టత కోసం చేపడుతున్న ఈ పనులకు వినియోగదారులు సహకరించాలని, ఏర్పడే అంతరాయాన్ని గమనించి సిబ్బందికి తోడ్పాటు అందించాలని కోరారు.

## వార్డులో వాదులాట

- **ఒకరు ప్రస్తుత బిఆరెస్ కౌన్సిలర్ భర్త**
- **మరొకరు బిజెపి మాజీ కౌన్సిలర్ భర్త**
- **వార్డు ఆఫీసర్ ముందే డిష్యూమ్ డిష్యూమ్..**



**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి మే 22 (జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పథకాలు అర్హత కలిగిన అందరికీ అందేలా 99 రోజుల కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగానే గద్వాల మున్సిపాలిటీలోని 36 వ వార్డులో పెన్షన్ లబ్ధిదారుల అప్డేట్ కోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్న క్రమంలో వార్డు ఆఫీసర్ ప్రక్కననే, వార్డు కౌన్సిలర్ సునీత లబ్ధిదారులతో వివరాలు సేకరిస్తున్న సమయంలో మాజీ కౌన్సిలర్ భర్త నరసింహులు తమ వార్డులో ఈ కార్యక్రమం జరుగుతున్నట్టు తమకు సమాచారం లేదనే విషయంపై చర్చ మొదలైంది,పక్కనే ఉన్న కౌన్సిలర్ సునీత భర్త రాము అందరికీ వార్డులో అధికారులే తెలియజేశారనే విషయం మాట్లాడుతూ అసలు విషయం పక్కదారి పట్టింది. ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల కోసం చేయూతని అందించే కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు వ్యక్తిగత గొడవలకు దిగడం సరికాదని ఆ వార్డు ప్రజలు అంటున్నారు.

## పురాతన కట్టడాల సందర్శన

**- శ్రమదానం నిర్వహించిన అధికారులు, నాయకులు**



**వెల్దుర్తి మే 22 (జనంసాక్షి):** 99 రోజుల ప్రజా పలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం మండల కేంద్రమైన మాసాయిపేటలో పురాతన కట్టడాలను, మసీదులను పలు ఆలయాలను మరియు మాసమ్మ దర్గా ప్రాంతంలో అధికారులు ప్రజాప్రతినిధులు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించి ఆలయ మసీదుల ప్రాంగణాలలో చెత్తను తొలగించి శుభ్రపరిచారు పలు ఆలయాల మరియు మజీదుల ప్రాముఖ్యత గురించి పలువురికి వివరించారు ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ మాసాయిపేట గ్రామానికి వందల సంవత్సరాల చరిత్ర ఉన్నదని ఇక్కడ నవాబుల కాలం నాటి దర్గాలు మరియు కాకతీయ కాలంనాటి పాండురంగని ఆలయాలు ఎన్నో ఉన్నాయని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కృష్ణారెడ్డి తో పాటు ఎంపీడీవో విగ్నేశ్వర్ తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## కార్మికులకు కనీస వేతనాలు పెంచిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం

**- కొల్చారం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగుల గారి మల్లేశం గౌడ్**

**కొల్చారం, మే22, (జనంసాక్షి):** సిమెంట్ మోసేది అతడే రోడ్లు వేసేది అతడే కట్టడాలు నిర్మించేది అతడే కానీ సంవత్సరాలుగా కనీస వేతనాల కోసం ఎదురు చూసింది కూడా ఆ కార్మికుడే అని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగులగారి మల్లేష్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల జీవితాల్లో నిజమైన మార్పు తీసుకొస్తోంది.రాష్ట్రంలో 1 కోటి 11 లక్షల మంది కార్మికులకు ప్రయోజనం కలిగేలా కనీస వేతనాలను భారీగా పెంచుతూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకుగాను కొల్చారం మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగిందని అన్నారు. వివిధ కేటగిరీలో పనిచేస్తున్న కార్మికుల జీతాలు పెంచడం చారిత్రాత్మక నిర్ణయమని కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుడు, ఉద్యోగి, రైతు అందరి కోసం పనిచేస్తోందని కార్మికుడి చెమటకు గౌరవం యువతకు అవకాశాలు సామాన్యుడికి భరోసా ఇదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని ఈ పరిస్థితుల్లో కార్మికుడి కష్టాన్ని అర్థం చేసుకునిఅతని కుటుంబానికి భరోసా ఇచ్చిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్లు నెల్లి



సంగమేశ్వర్, దేవన్నగారి శేఖర్, మాజీ సర్పంచ్ శ్రీశైలం, కాంగ్రెస్ నాయకులు విజయ్ , బాలరాజు, పహాడ్ చౌరిగారి ఆంజనేయులు, సొహెల్, ఉపేందర్ గౌడ్ పాల్గొన్నారు.

# అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల సమిష్టి కృషితోనే జిల్లా అభివృద్ధి

- ప్రభుత్వ పథకాల అమలులో ప్రజలే కేంద్రబిందువు
- ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక ప్రజల భాగస్వామ్యంతోనే విజయవంతం
- సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యం
- రైతు భరోసాతో రైతులకు అండగా ప్రభుత్వం
- ఇందిరమ్మ ఇళ్లు - ప్రతి కుటుంబానికి సొంతింటి కల సాకారం
- మహాలక్ష్మి, మహిళా శక్తి పథకాలతో మహిళల ఆర్థిక సాధికారత
- విద్య, సంక్షేమ రంగాలకు ప్రాధాన్యం - విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వం అండ
- పంటల మార్పిడి - లాభదాయక వ్యవసాయానికి ప్రోత్సాహం
- ప్రతి గడపకు సంక్షేమ పథకాల ఫలాలు
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, మే 22 (జనంసాక్షి):**
అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల సమిష్టి కృషితోనే జిల్లా ప్రగతి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ ప్రతి మా సింగ్ అన్నారు. శుక్రవారం, 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మీటింగ్ హాల్లో జిల్లా స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్స్ రాధిక భూపతి రాజ్ లావణ్య, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ,అదనపు కలెక్టర్ నగేష్ జిల్లా అధికారులు పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ఆరంభించి, రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. అనంతరం ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన పెంపొందించడం, స్థానిక అవసరాలు, ప్రాధాన్యతలను నేరుగా తెలుసుకొని అభివృద్ధి కార్యాచరణ రూపొందించడం లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న "ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక (99 రోజుల కార్యాచరణ)" కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు.

ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక అనేది కేవలం పరిపాలనా కార్యక్రమం కాదని, ఇది ప్రజాస్వామ్య పాలనకు ఒక ఆచరణాత్మక రూపమని అన్నారు.

అనంతరం ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాల గురించి అలాగే రాబోయే రోజుల్లో అమలుచేయనున్న పలు సంక్షేమ పథకాలను వివిధ శాఖలకు చెందిన అధికారులు క్షుణ్ణంగా వివరించారు.

అలాగే కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, ఇందిరా మహిళా శక్తి పథకం, వడ్డీ లేని రుణాలు, అదే విధంగా ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు అల్పాహార పథకం, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా, ఇంటర్ వరకు మధ్యాహ్న భోజనం, దివ్యాంగ విద్యార్థులకు మోటార్ వాహనాలు, పంట మార్పిడి, సేంద్రీయ వ్యవసాయం పథకాలపై నిశితంగా వివరించారు. మెదక్ మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక భూపతి రాజు మాట్లాడుతూ.. ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, గ్రామ స్థాయి నుంచి ప్రతి ఇంటి వరకు ప్రభుత్వ కార్యక్రమాలు చేరేలా కృషి చేయాలని జిల్లాలోని వివిధ మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి సమస్యలపై చర్చించారు. ఇందులో భాగంగా.. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, బోధన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని, అంగన్వాడీ కేంద్రం, ఓహెచ్ఆర్ ట్యాంకు, విద్యుత్ ట్రాన్స్ఫార్మర్, సీసీ రోడ్లు, నిర్మాణం జరగాలన్నారు.

తదనంతరం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో వైద్యారోగ్య, గృహ నిర్మాణ శాఖ, ఆర్థిక అక్షరాస్యత కేంద్రం, గ్రామీణాభివృద్ధి, మహిళా శక్తి – రైతు సేవా కేంద్రం, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ, ఎస్సీ సంక్షేమ శాఖ, ఇలా వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను వారు సందర్శించి, పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపిడిఓలు, తహసీల్దార్లు, సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# రూ.200 కోట్లతో యంగ్ ఇండియా పాఠశాలలు

- కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపు
- రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ



**సంగారెడ్డి ప్రతినిధి, మే 22 (జనంసాక్షి):**
నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు లక్ష్యంగా ఒక్కోటి రూ.200 కోట్లతో యంగ్ ఇండియా పాఠశాలలను నిర్మిస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వివరించారు. జిల్లాలో 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కంది సమీపంలోని ఎల్.ఎన్. కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... తెలంగాణ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం దూరదృష్టితో నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. వ్యవసాయ రంగంలో రైతులకు అండగా నిలవడం ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. కుటుంబ సంక్షేమానికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు అవసరమని, ప్రతి ఒక్కరు ఆత్మగౌరవంతో జీవించేలా నైపుణ్య ఆధారిత విద్యను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో గత ఏడాది వెయ్యి ప్రీ-ప్రైమరీ పాఠశాలలు ఏర్పాటు చేయగా, అందులో జిల్లాలోనే సుమారు 130 పాఠశాలలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నామని, ప్రతి నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు లక్ష్యంగా ఒక్కోటి రూ.200 కోట్లతో యంగ్ ఇండియా పాఠశాలలను నిర్మిస్తున్నామని వివరించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగి స్వయం సమృద్ధిగా జీవించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి అన్నారు.

ఆరోగ్య రంగంలో ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడంతో పాటు 163 కొత్త చికిత్సలను చేర్చినట్లు మంత్రి తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు 90 శాతం వైద్య సేవలు జిల్లాలోనే అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతి 35 కిలోమీటర్లకు ట్రామా కేర్ సెంటర్, ప్రతి 25 కిలోమీటర్లకు డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో 9 వేల నర్సింగ్ పోస్టులు భర్తీ చేయడంతో పాటు 16 నర్సింగ్ కాలేజీలు ఏర్పాటు చేశామని, మొత్తం 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు చెప్పారు. సిబ్బంది, మందుల కొరతపై ఎలాంటి ఫిర్యా దులు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సనత్‌నగర్‌లో వెయ్యి పడకల టిమ్స్ ఆసుపత్రిని జూన్ నెలలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

**జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ..**
జిల్లా యంత్రాంగం అన్ని శాఖల సమన్వయంతో పారదర్శక పాలన అందించే దిశగా కృషి చేస్తోందన్నారు. జిల్లాను రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కులాంతర వివాహం చేసుకున్న జంటలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, సి.డి.సి చైర్మన్ రామ్‌రెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.ఏ. ఫహీమ్, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, అదనపు కలెక్టర్ పాండు, మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత, ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయి

- ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం కొల్చారం, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం దుంపలకుంట
- మండల వ్యవసాయ అధికారి శ్వేతా కుమారి

**కొల్చారం, మే 22, (జనంసాక్షి):** కూల్చారం మండల రైతులు సేంద్రియ సాగు వైపు మళ్లేలా ప్రోత్సహించడానికి, వ్యవసాయశాఖ ద్వారా జీలుగు విత్తనాలను 50శాతం సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి శ్వేతా కుమారి తెలిపారు. అధిక మోతాదులో రసాయన ఎరువులు వాడడం వల్ల తగ్గుతున్న భూసారాన్ని పెంచే లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. రైతులు ఈ జీలుగు విత్తనాలను 50 శాతం సబ్సిడీపై కేవలం రూ. 2452.50కే పొందవచ్చు. ప్రస్తుతం 230 క్వింటాలు అందుబాటులో ఉన్నాయి. వీటి పంపిణీ రేపు ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతుందనీ తెలిపారు.

**జీలుగు విత్తనాల ప్రయోజనాలు:**
భూసారం పెరుగుదల ఈ విత్తనాలను చల్లి, 35 నుంచి 45 రోజుల తర్వాత పూత రాకముందే నేలలో కలియ దున్నినట్లయితే, సుమారు 12 టన్నుల జీవ పదార్థం నేలలోకి చేరుతుంది. దీనివల్ల సేంద్రియ కర్బన పదార్థం పెరిగి, భూమి సారవంతమవుతుంది. సూక్ష్మజీవుల పెంపకం జీవపదార్థం పెరగడం వల్ల నేలలో మొక్కలకు మేలు చేసే సూక్ష్మజీవులు, వానపాముల సంఖ్య పెరుగుతుంది. తెగుళ్ల నివారణ పంట మార్పిడి జరగడం వల్ల వరిలో వచ్చే కాండం తొలుచు పురుగు, అగ్గి తెగులు, సుడిదోమ వంటి తెగుళ్ల ఉధృతి తగ్గుతుంది. ఎరువుల వాడకం తగ్గింపు జీలుగు మొక్క గాలిలోని నత్రజనిని నేలలో నిక్షిప్తం చేయడం ద్వారా యూరియా వంటి రసాయన ఎరువుల వాడకం తగ్గుతుంది. నీటి నిల్వ సామర్థ్యం పద్ధతి వల్ల నేల నీటిని నిల్వ చేసుకునే శక్తి పెరుగుతుంది. కావల్సిన రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ తో ఆగ్రోస్ రైతు సేవ కేంద్రం కూల్చారం మరియు ఆగ్రోస్ రైతు సేవ కేంద్రం దుంపలకుంట నందు సంప్రదించి, మండల వ్యవసాయ కార్యాలయం మరియు రంగంపేట్ రైతు వేదిక ద్వారా ఆన్‌లైన్ పర్మిట్ తీసుకొని విత్తనాలను కొనుగోలు చేసుకోవాలి. రైతులకు జిప్సం 90 శాతము సబ్సిడీ పైన అందుబాటులో ఉన్నది, జిప్సం ఒక మెట్రిక్ 534 రూపాయలు కావలసిన రైతులు హెచ్ ఏ సి ఏ లిమిటెడ్ పై డిడి తీయవలెనని తెలిపారు. అప్లికేషన్ వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందించగలరు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి తెలిపారు.

# ఎండ తీవ్రత నేపథ్యంలో ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



**లింగాల 22 మే (జనంసాక్షి):** లింగాల మండలంలోని పద్మనపల్లి గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న గ్రామ కూలీలకు గ్రామ సర్పంచ్ ఎం శంకర్ 100 మందికి మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఉదయం తొందరగా వచ్చి పని చేసుకొని 10 గంటలకు పని ముగించుకొని వెళ్లే విధంగా ఏర్పాటు చేసుకోవాలని వారు కోరారు గ్రామంలో ఎక్కువ మంది ప్రజలు ఈ ఉపాధి హామీ పథకంలో పనిలో పాల్గొనాలని సర్పంచ్ శంకర్ కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శంకర్ డిప్యూటీ సర్పంచ్ దేవి వెంకట్రాం వార్డు మెంబర్ చందు పద్మ మాజీ సర్పంచ్ దేవి సేవ్య నాయకులు రాములు వెంకటరెడ్డి పులియా బాలస్వామి శంకర్ వాల్య లక్ష్మణ్ పాల్గొనడం జరిగింది

# మైనర్ బాలిక పెళ్లి ఆపేసిన స్థానిక ఎస్సై జె. నరేష్ కుమార్ పోలీసు బృందం



**వీపనగండ్ల,, మే 23 (జనంసాక్షి):**
వీపనగండ్ల మండల పరిధిలోని బొల్లారం గ్రామానికి చెందిన వంక రాధా భర్త కీర్తిశేషులు రామకృష్ణ దంపతుల కూతురు మైనర్ బాలిక కు వయస్సు 12 సం వివాహం చేస్తుండగా వీపనగండ్ల మండల ఎస్సై జె. నరేష్ కుమార్ ఆధ్వర్యంలోని పోలీసు బృందం పెళ్లి ఆపి తల్లిదండ్రుల పైన కేసు నమోదు చేశారు. సందర్భంగా మాట్లాడుతూ మైనర్ బాలికకు తూముకుంట గ్రామానికి చెందిన మండల సురేష్ సింగోటం గ్రామంలోని లక్ష్మీనరసింహ దేవాలయంలో గురువారం రాత్రి 10 గంటల సమయంలో వివాహం చేసుకుంటుండగా సమాచారం అందుకున్న పోలీసులు తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్కు తరలించి విచారణ జరిపి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మైనర్ బాలికను సి డబ్ల్యూ సి ఆధ్వర్యంలో అప్పగించి కౌన్సిలింగ్ చేసినట్లు తెలిపారు. మైనర్ బాలికల బాలుర పెళ్లిలు చట్టపరంగా నేరమని తల్లిదండ్రులు మైనర్ వివాహాలను ప్రోత్సహించవద్దని ఈ సందర్భంగా అన్నారు.

# కొనుగోలు కేంద్రంలో రైతు మృతి

**- కుటుంబ సభ్యులను ఓదార్చిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి**

**కొల్చారం, మే 22, (జనంసాక్షి):** కుప్ప పోసిన ధాన్యం రాసినీ చూడడానికి వెళ్లి కొనుగోలు కేంద్రంలోని రైతు మృతి చెందిన ఘటన కొల్చారం మండలం లోని చిన్న ఘనపూర్ గ్రామంలో శుక్రవారం ఉదయం చోటుచేసు కుంది. గ్రామానికి చెందిన వెంకటాపురం శంకరయ్య (54) గత నెల రోజుల క్రితం వరి పంట హార్వెస్టింగ్ చేసి కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చారు. ధాన్యాన్ని ఆరబెట్టి తూకానికి సిద్ధం చేసి ఉంచారు. ఎంతకీ తూకం వేయక పోవడంతో నెల రోజులుగా నిర్వాహకుల వెంట తిరుగుతూ ఎండలో ధాన్యం కుప్ప వద్ద పడికాపులు కాశారు. ఈ క్రమంలో శుక్రవారం సైతం దాన్యం కుప్ప వద్దకు వెళ్లి కూర్చున్న దగ్గరే హఠాత్తుగా తూలిపడి స్పృహ తప్పి పడిపోయాడు. తోటి రైతులు పైకెత్తి చూడగా విగత జీవుడై ఉన్నాడు. ఎండ దెబ్బకు గురై శంకరయ్య మృతి ఒడికి చేరుకున్నారని గ్రహించిన తోటి రైతులు బోరుమన్నారు. కుటుంబ సభ్యుల ఆక్రందనను మిన్నంటాయి. ప్రభుత్వ నిర్లక్ష్యమే శంకరయ్య ప్రాణం తీసింది అని గ్రామస్తులు వాపోయారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే



సునీత లక్ష్మారెడ్డి గ్రామాన్ని సందర్శించి శంకరయ్య కుటుంబ సభ్యులను ఓదార్చారు. కలెక్టర్ అడిషనల్ కలెక్టర్లకు అక్కడి నుండే ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి, అధికారులను పంపించి శంకరయ్య కుటుంబానికి సహాయం అందించాలని కోరారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో ఎక్కడి ధాన్యం అక్కడే కొనుగోలు కేంద్రాలలోనే మగ్గుతుంది అన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వినడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి లారీల సదుపాయం కల్పించి వెంట వెంటనే ధాన్యం తరలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు టిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మిల్లర్ల దోపిడీని అరికట్టండి : బిజెపి మండల అధ్యక్షులు బుచ్చిబాబు గౌడ్

**ఖిల్లా ఘనపురం, 22, మే, (జనంసాక్షి):** మండలంలో కొన్ని రైస్ మిల్లులో ధన్య కొనుగోలు లో అవకతవకలు జరుగుతున్నాయి అని అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న ఆయా రైస్ మిల్లులను సీజ్ చెయ్యాలని స్థానిక తహశీల్దార్ కు బిజెపి మండల నాయకులు వినతి పత్రం ద్వారా తెలపడం జరిగింది.వివరాలకు వెళితే అప్పారెడ్డిపల్లి గ్రామం లోని ఐకెపి సెంటర్లలో మ్యాచింగ్ చేసి తూకం చేసిన వడ్లను మండల కేంద్రంలో ఓ రైస్ మిల్లుకు రాయగా అక్కడికి ఈ నెల 19 తారీకు నాడు అక్కడికి సదరు రైతులు వెళ్లగా శుక్రవారం వరకు అక్కడే ఉన్న రైతు కొత్త గొల్ల కేశవులు 217 సంచులకు తీసుకువెళ్లగా దాని నుండి 50 సంచులు తరుగు వడ్లను తీస్తాను అని రైస్ మిల్ సుప్రవేజర్ చెప్పడంతో అవక్కు ఆయన కేశవులు వెంటనే మండల బిజెపి నాయకులకు తెలిపారు స్పందించిన బిజెపి మండల నాయకులు మండల తహసిల్దార్ కలసి వడ్ల తూకంలో జరుగుతున్న అవకతోకలను వివరించడం జరిగింది మండల అధ్యక్షులు బూచి బాబు మాట్లాడుతూ,, ఒక్కొక్క రైతు దగ్గర 40 బస్తాలు 50 బస్తాలు తరుగు పేరిట తీస్తున్నారంటే ఎవరి అండదండలతో ఇలా రైతులను మోసం చేసే పనిని తలపెడుతున్నారని మండల కేంద్రంలో ఉన్న రైస్‌మిల్‌లో రైతులకు జరుగుతున్న అన్యాయాలపై విచారణ చేసి వడ్లకొనుగులు లో అవకతవకలు జరగకుండా చూడాలని తహసిల్దార్ బి.సుగుణకు వినత



పత్రం ద్వారా తెలియజేశారు. రైతులకు అన్ని ఐకెపి సెంటర్లలో ఉచితంగా సుత్తిల్లు సంచులు హమాలి డబ్బులు వెహికల్ ట్రాన్స్పోర్ట్ మొత్తం ప్రభుత్వమే చూసుకోవాలని కేంద్రం ఇచ్చిన మద్దతు ధర అందరి రైతులకు అందేలా చేయాలని రైతుల నుండి 41.200 గ్రాములు పెడుతున్నారు కానీ దళారులు 3 నుండి 6 కిలోలా వరకు తరుగు ఇస్తున్నారు ఇలా చేయడం వలన చిన్న సన్న కారు రైతులు నష్టపోతున్నారు ఇలాంటివి జరగకుండా చూడాలని తహసిల్దార్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టి మోర్చా జిల్లా అధ్యక్షులు రవి నాయక్, జిల్లా కౌన్సిల్ మెంబర్ దాసర్ల సత్యనారాయణ, ఒబిసి మోర్చా జిల్లా కార్యదర్శి బెన్నూరు ఆషన్న, మండల ప్రధాన కార్యదర్శులు కొరిగెల గోపి ముదిరాజ్, మండల నాయకులు కొత్త గొల్ల కేశవులు, రాములు రైతులు తిరుపతయ్య ,నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా గాంధీ పాఠశాలలో చేరుటకు ఆహ్వానం

**చేర్యాల మే22 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని కేజీబీవీ కస్తూరిబా గాంధీ పాఠశాల మరియూ కళాశాలలో 6వ తరగతి నుంచి 10తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సీఈసీ గ్రూప్ లలో 10 సీట్లు ఖాళీగా ఉన్నట్లు స్పెషల్ ఆఫీసర్ కే.కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవ కాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అడ్మిషన్ కోరే తల్లిదండ్రు లు 6301719169 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు

# కార్మిక పక్షపాతి మన ప్రభుత్వం

**- మెదక్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హాఫిజుద్దీన్**



**మెదక్, మే 22 (జనంసాక్షి):** తెలంగాణలోని దాదాపు 1.11 కోట్ల (1 కోటి 11 లక్షల) మంది కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించిందని శ్రామిక లోకం సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ, వారి కనీస వేతనాలను పెంచుతూ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. పెంచిన ఈ కొత్త వేతనాలు జూన్ 1వ తేదీ నుండి అమల్లోకి రానున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారికంగా ప్రకటించారని అయన ఒక్క ప్రకటనలో తెలిపారు. కనీస వేతనాల పెంపు పట్ల మెదక్ బ్లాక్ కాంగ్రెస్ కమిటీ హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అలాగే నిరంత రం కార్మికుల పక్షాన నిలిచిన మహానుభావుడు 'కాకా' వెంకటస్వామి ఆశ యాల వారసుడిగా, కార్మికశాఖ మంత్రిగా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న వెంకట స్వామి తనయుడికి మెదక్ నియోజకవర్గ కార్మికుల తరపున హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# నార్కోటిక్ డాగ్స్‌తో తాడురు గ్రామంలో ముమ్మర తనిఖీలు

**- చేర్యాల ఎస్ఐ గూడ అపూర్వారెడ్డి**

**చేర్యాల, మే 22(జనంసాక్షి):** గంజాయి, ఇతర మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చేందుకు పోలీస్ యంత్రాంగం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఆదేశాల మేరకు శుక్రవారం చేర్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని తాడురు గ్రామంలో నార్కోటిక్ డాగ్స్‌తో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. గ్రామంలోని కిరాణా షాపులు, టీ కొట్టులు, పాన్ షాపులు, ఇతర అనుమానాస్పద ప్రాంతాలలో ఈ సోదాలు జరిగాయి. ఈ సందర్భంగా చేర్యాల సబ్ ఇన్స్పెక్టర్ ఎస్ఐ అపూర్వరెడ్డి మాట్లాడుతూ.. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మత్తుపదార్థాల సరఫరా, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. గంజాయి, డ్రగ్స్, లేదా మత్తు పదార్థాలు కలిపిన చాక్లెట్లను ఎవరైనా కలిగి ఉన్నా, అక్రమంగా రవాణా చేసినా లేదా షాపుల్లో విక్రయించినా చట్టప్రకారం కఠిన కేసులు నమోదు చేయ




డం జరుగుతుందని, జిల్లాను గంజాయి రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలనీ కోరారు. మీ ప్రాంతంలో ఎవరైనా గంజాయి లేదా ఇతర మత్తుపదార్థాలను విక్రయించినా, కలిగి ఉన్నా వెంటనే డయల్ 100 లేదా 1908 నంబర్లకు సమాచారం అందించగలరు. సమాచారం అందించిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయని ఎస్ఐ అపూర్వరెడ్డి తెలిపారు.

# పర్యాటక శోభ సంతరించుకునేలా స్వామి బావికి తుది మెరుగులు

**- దాయర్లో పురాతన కట్టడాలను అధికారులతో కలిసి పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, మే 22 (జనంసాక్షి):** పర్యాటక శోభ సంతరించుకునే విధంగా పురావస్తు శాఖ అధికారుల సమన్వయంతో స్వామి బావినీ తుది మెరుగులతో పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ తెలిపారు. పర్యాటక వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల నేపథ్యంలో శుక్రవారం ఉదయం మెదక్ దాయార పురాతన కట్టడాలైన బావి, దేవాలయాలు సందర్శించిన జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్, మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, మెదక్ ఆర్డీవో రమాదేవి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, వ్యాయామ ఉపాధ్యాయులు యువత, ఇతర ప్రజాప్రతినిధులు గ్రామస్తులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పర్యాటక వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా దాయారంలోని స్వామి బావిని పరిశీలించడం జరిగిందని పురాతన స్వామి బావి ఈ ప్రాంతంలో ఉన్న పురాతన దేవాలయాలను సందర్శించామని



స్వామి బావిని ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి తుది మెరుగులతో భావిని పునరుద్ధరించి భావితరాలకు ఈ భావియొక్క గొప్పతనాన్ని తెలిపే విధంగా తీర్చి దిద్దుతామన్నారు. మెదక్ జిల్లాలోని పర్యాటక శోభ సంతరించే విధంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి పర్యాటక ప్రాంతాలను తుదిరూపు తీసుకువచ్చే విధంగా పర్యాటక పురావస్తు శాఖ అధికారుల సమన్వయంతో మౌలిక వసతులు కల్పనపై పటిష్ట చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా సేవే కర్తవ్యం..
# సామాజిక చైతన్యమే స్ఫూర్తిపర్యావరణ పరిరక్షణే బాధ్యత

**- 26 ఏండ్లుగా విద్యారంగంలో సేవలు**
**- గౌరవ డాక్టరేట్ ఆయిల్ సదానందం గౌడ్**
**- అయిల్ సదానందం గౌడుకియునైటెడ్ అమేరికన్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అవార్డుతో సత్కారం**



**కల్వకుర్తిరూరల్,మే 12,(జనంసాక్షి):** మహాత్మా జ్యోతిరావు పూలే,డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో విద్యా వ్యవస్థలో క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూనే పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ,విద్య బోధన చేస్తు,పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతు,సామాజిక సమస్యలపై ఉద్యమిస్తు విద్యార్థుల్ని, యువకుల్ని,మహిళల్ని,ప్రజలను చైతన్యం చేస్తు కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చరిత్ర అధ్యాపకునిగా సదానందం గౌడు సమర్ధవంతంగా నిధులు నిర్వహిస్తున్నారు.తెలంగాణ లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ సంస్థ ద్వారా జేడి లక్ష్మీ నారాయణ చేతుల మీదుగాఉత్తమ లెక్చరర్ అవార్డు - 2022దిశ ఫౌండేషన్ ఆఫ్ హైదరాబాద్ ద్వారాఘంట చక్రపాణి,అల్లం నారాయణ చేతుల మీదుగాడాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అవార్డు - 2023 భారత భారతి సంస్థ ద్వారాబెస్ట్ మోటివేటర్ ఎర్రబైరు సురేందర్ రెడ్డి, తుడి హన్మంత రెడ్డిచేతుల మీదుగా ఉత్తమ లెక్చరర్ అవార్డు - 2024 కల్వకుర్తి ఎమ్మార్వో మంజూల ద్వారాఉత్తమ తెలంగాణ ఉద్యమకారులు - 2015 తర్నకల్ హైస్కూల్ - 2019, కల్వకుర్తి గర్ల్స్ హైస్కూల్ - 2020 మరియు వివిధ హైస్కూల్ నుంచి సన్మానాలులి సత్కారాలు, పొందుతూఉమ్మడి పాలమూరు జిల్లాలో మరియు కల్వకుర్తి తాలూకాలోఎంతో మంది విద్యార్థులకు,యువతకు ఆదర్శంగా నిలుస్తుతెలంగాణ జేఏసీ చైర్మన్ గా,కల్వకుర్తి ఆర్డీవో సాధనకారుడిగా,కే ఎల్ ఐ KLI నీళ్ళ సాధకుడుగా,సామాజిక ఉద్యమకారులు గాలెక్చరర్ సదానందం గౌడు ఆనందంగా జీవిస్తున్నారు. సామాజిక విద్యావేత్త,పర్యావరణ పరిరక్షకులు,తెలంగాణ ఉద్యమకారులుఅయిల్ సదానందం గౌడుకు యునైటెడ్ అమేరికన్ యూనివర్సిటీచే గౌరవ డాక్టరేట్ అవార్డులభించడంతో సామాజిక విద్యావేత్తలు, మేధావులు,విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.